సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

ఎఫ్‌టీఎల్ ఆక్రమణలపై చర్యలు చేపట్టాలి

కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 11 : జిల్లాలోని చెరువులు, కుంటలు ఆక్రమణకు కాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో హెచ్‌ఎండీఏ పరిధిలోని 8 మండలాలకు సంబంధించిన చెరువులు, కుంటలపై తహసీల్దార్లు, నీటి పారుదల, రెవెన్యూ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణంలో ఉన్న భవనాలను తొలిగించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారి ఐనేష్, డీఈ ఏసయ్య, ఈఈ భీమ్, హెచ్‌ఎండీఏ పరిధిలోని 8 మండలాల తహసీల్దార్లు, నీటి పారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

బూత్ స్థాయి ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవాలి

అంతకుముందు కలెక్టరేట్‌లోని గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. పక్క ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ కోరారు. అక్టోబర్ 29న ఓటరు జాబితా డ్రాఫ్ట్ రోల్ ప్రకటించనున్నామని, పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల పేర్లను జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. అక్టోబర్ 29 నుంచి నవంబర్ 28 వరకు రెండు పర్యాయాలు పోలింగ్ బూత్ స్థాయిలో స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించనున్నామని తెలిపారు. కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు ఆంథోనీ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నిమజ్జనం చెరువులను పరిశీలించిన ఎస్పీ

పటాన్‌చెరు, సెప్టెంబర్ 11 : పటాన్‌చెరు నియోజకవర్గంలోని బొల్లారం, అమీన్‌పూర్, పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ల పరిధిలోని చెరువులను జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్, అదనపు ఎస్పీ సంజీవరావు, పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డిలతో కలిసి పరిశీలించారు. బుధవారం పటాన్‌చెరు పట్టణంలోని సాకి చెరువు, అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ శంబునికుంట, బొల్లారం చెరువుల్లో వినాయక విగ్రహాల నిమజ్జనాలు జరుగబోతున్నాయి. భారీ విగ్రహాలను ఇక్కడి చెరువుల్లో నిమజ్జనం చేయనున్న నేపథ్యంలో పోలీసులు, మున్సిపల్ అధికారులు తీసుకుంటున్న చర్యలను ఆయన పరిశీలించి పలు సూచనలను చేశారు. జీహెచ్‌ఎంసీ ఉపకమిషనర్ సురేశ్‌తో ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీసు శాఖ, జీహెచ్‌ఎంసీ శాఖ

పటాన్‌చెరు సాకి చెరువును పరిశీలిస్తున్న ఎస్పీ రూపేశ్

ల సమన్వయంతో వినాయక నిమజ్జనాల ప్రక్రియను విజయవంతం చేయాలని ఎస్పీ కోరారు. అదనపు ఎస్పీ సంజీవరావు, పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ ప్రవీణ్‌రెడ్డి, అమీన్‌పూర్ సీఐ నాగరాజు పాల్గొన్నారు.

నిమజ్జన ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి

బొల్లారం, సెప్టెంబర్ 11: వినాయక విగ్రహాలు నిమజ్జనం చేసే ప్రదేశాల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ ఎస్పీ సంజీవరావు అన్నారు. బుధవారం బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని మాధవాని కుంట వద్ద నిమజ్జన ఏర్పాట్లను డీఎస్పీ రవీందర్ రెడ్డితో కలిసి పరిశీలించారు. సీఐ గంగాధర్, ఆర్వో నర్సింహులు, శానిటరీ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏర్పాట్లు పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ

దవాఖానపై చర్యలు తీసుకోవాలి

హత్నూర, సెప్టెంబర్ 11 : బాలు డి మరణానికి కారణమైన శిశురక్ష దవాఖానపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ హత్నూర మండలం కొన్యాల గ్రామానికి చెందిన ప్రభులింగం బుధవారం సంగారెడ్డి డీఎంహెచ్‌వో, సంగారెడ్డి టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 45రోజుల వయస్సుగల తన చిన్నకుమారుడు ధృష్నిక్ అనారోగ్యంతో బాధపడుతుండగా, ఈనెల 5న సంగారెడ్డిలోని శిశురక్ష ప్రైవేటు దవాఖానకు చికిత్సకోసం తీసుకెళ్లినట్లు తెలిపారు. అక్కడ బాలుడికి వైద్యపరీక్షలు జరిపి డెంగీ వచ్చిందని మూడు రోజులపాటు వైద్యంచేసిన డాక్టర్లు బాలుడి ఆరోగ్యపరిస్థితిపై కుటుంబ సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే రూ.లక్ష వరకు వసూలుచేసినట్లు ఆరోపించారు. బాలుడి ఆరోగ్యపరిస్థితి విషమించి ఈనెల 8న నిలోఫర్ దవాఖానకు తీసుకెళ్లాలని సూచించి మొత్తం డబ్బులు కట్టించుకొని దవాఖానకు చెందిన వెంటిలేటర్ అంబులెన్స్‌లో తరలించినట్లు ఆరోపించారు. దీంతో నిలోఫర్ దవాఖానకు వెళ్లగా బాబు మృతి చెంది రెండు గంటలు అవుతుందని అక్కడివైద్యులు తెలుపడంతో ఇంటికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కొడుకు మరణానికి కారణమైన శిశురక్ష ప్రైవేటు దవాఖానపై చర్యలు తీసుకోవాలని బాధితుడు ప్రభులింగం కోరారు.

రిక్గ్నైజ్‌డ్ స్కూల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సాయితేజ

అధ్యక్షుడు సాయితేజ

పటాన్‌చెరు, సెప్టెంబర్ 11 : పటాన్‌చెరు రిక్గ్నైజ్‌డ్ స్కూల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సాయితేజను ఎన్నుకున్నారు. బుధవారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామంలోని సెయింట్ మేరీస్ గ్రామర్ హై స్కూల్‌లో పటాన్‌చెరు రిక్గ్నైజ్‌డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ (పీఆర్ఎస్ఎంఏ) ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ఎన్నికల్లో 50 స్కూల్స్ యజమాన్యాలు పాల్గొన్నాయని సమన్వయకర్త విలియం జెమ్స్ తెలిపారు. ఎన్నికల్లో పటాన్‌చెరు పట్టణంలోని విద్యాభారతి హై స్కూల్ కరస్పాండెంట్ జీ సాయితేజ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారన్నారు. సంగారెడ్డి జి ల్లా అధ్యక్షుడు కే జనార్దన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, విలియం జెమ్స్, విజయశ్రీ, లక్ష్మీపతి, రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ముందుండాలి

మునిపల్లి, సెప్టెంబర్ 11 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ముందుండాలని మునిపల్లి ఎంపీడీవో హరినందన్‌రావు తెలిపారు. బుధవారం మండలంలోని లింగంపల్లి గురుకుల పాఠశాల వద్ద మండల స్థాయి క్రీడలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై ఎంత దృష్టి ఉంచుతారో ఆటలపై సైతం అంతే దృష్టి పెట్టాలన్నారు. మండల స్థాయి అండర్-12,14,17 లకు సంబంధించి విద్యార్థులు,విద్యార్థినీలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. మండల స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఆయా పాఠశాలల విద్యార్థులకు మునిపల్లి ఎంపీడీవో బహుమతులు అందజేశారు. మునిపల్లి ఎమ్ఈవో దశరథ్, తదితరులు ఉన్నారు.

గ్రామపంచాయతీల్లో పురపాలన షురూ

రామచంద్రాపురం, సెప్టెంబర్ 11 : గ్రామపంచాయతీల్లో పురపాలన షురువైంది. గ్రామపంచాయతీలకు సంబంధించిన రికార్డులను మున్సిపల్ అధికారులు స్వాధీనం చేసుకుంటున్న ప్రక్రియ కొనసాగుతుంది. తెల్లాపూర్ మున్సిపాలిటీలో పటాన్‌చెరు మండలానికి చెందిన ఐదు గ్రామపంచాయతీలు పాఠి, ఘనపూర్, కర్ధనూర్, పోచారం, ముత్తంగి గ్రామాలను విలీనం చేస్తు రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. ఈ మేరకు తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి నేతృత్వంలో ఆయా గ్రామపంచాయతీలకు సంబంధించిన రికార్డులను మున్సిపల్ అధికారులు స్వాధీనపర్చుకుంటున్నారు. ఆయా గ్రామపంచాయతీలకు మున్సిపల్ వార్డు కార్యాలయం బోర్డులు పెట్టారు. ఇకమీదట గ్రామపంచాయతీలో మున్సిపల్ పాలన కొనసాగనున్నది. గ్రామపంచాయతీల సిబ్బంది కూడా మున్సిపల్ పరిధిలోకి రానున్నారు. ఈ సందర్భంగా తెల్లాపూర్ కమిషనర్ సంగారెడ్డి మాట్లాడుతూ తెల్లాపూర్ మున్సిపాలిటీలోకి ఐదు గ్రామపంచాయతీలు విలీనమయ్యాయని, ఇప్పటికే పలు గ్రామపంచాయతీల రికార్డులను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆయా గ్రామపంచాయతీలకు సంబంధించిన రికార్డులను పూర్తిస్థాయిలో స్వాధీనం చేసుకొని సీల్‌వేసి రికార్డ్ రూమ్‌లో భద్రపర్చుతాం. విలీనమైన గ్రామపంచాయతీలో ఇప్పటి నుంచి మున్సిపల్ పాలన ఉంటుందన్నారు. మరో రెండు రోజుల్లో రికార్డుల స్వాధీన ప్రక్రియ పూర్తవుతుందని ఆయన పేర్కొన్నారు.

ఘనపూర్ గ్రామపంచాయతీలో రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్ సంగారెడ్డి

హామీలు అమలు చేయలేకనే 'హైడ్రా'మా

జహీరాబాద్‌లో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

ఎంపీ డీకే అరుణ

కోహీర్, సెప్టెంబర్11: హామీలను అమలు చేయలేకనే హైడ్రా పేరుతో ప్రజల దృష్టిని మళ్లిస్తున్నారని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ విమర్శించారు. బుధవారం జహీరాబాద్ పట్టణంలో రైతు హక్కుల సాధన సమితి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, రైతు బంధు ఇంతవరకు ఇవ్వలేదని మండిపడ్డారు. పథకాలను అమలు చేయడం చేతగాక 'హైడ్రా' పేరుతో నాటకాలు ఆడుతున్నారన్నారు. కొంతమంది ఇండ్లను కూల్చడమేమిటని ఆమె ప్రశ్నించారు. అందరికీ సమానంగా ఉండాలన్నారు. అందరికీ నోటీసులు ఇచ్చిన తర్వాతనే చర్యలు తీసుకుంటే బాగుండేదని చెప్పారు. కొందరి ఇండ్లను కూల్చి మరికొందరికి మినహాయింపు ఇవ్వడం ఎందుకన్నారు. వ్యక్తి గత కక్ష పెట్టుకొని కూలుస్తున్నారన్నారు. రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్లి భారతదేశాన్ని అవమానిస్తున్నారని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ జైపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాసిటీని నిలిపివేయాలని వినతి

తమ పచ్చని పొలాల్లో ఏర్పాటు చేసేందుకు యత్నిస్తున్న ఫార్మాసిటీని వెంటనే నిలిపివేయాలని ఎంపీ డీకే అరుణకు వినతిపత్రం సమర్పించారు. బుధవారం జహీరాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో న్యాల్‌కల్ మండల రైతులు ఆమెకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాల్‌కల్ మండలంలోని డప్పూర్, మల్గి, వడ్డి గ్రామాల రైతుల నుంచి ఫార్మా సిటీ నిర్మాణం కోసం 2,300 ఎకరాల భూ సేకరణ చేపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంట పొలాల్లో నిర్మిస్తే తమ బతుకులు ఆగమవుతాయన్నారు. భూసేకరణను వెంటనే నిలిపివేయాలని వారు విన్నవించారు.

ఇంటింటికీ మొక్కలు పంపిణీ

సంగారెడ్డి, సెప్టెంబర్ 11 : వనమహోత్సవంలో భాగంగా వార్డులోని ప్రతి ఇంటి ముందు మొక్కలు నాటి సంరక్షణ చేయాలని, పర్యావరణాన్ని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉండని కౌన్సిలర్ దిడ్డి విజయలక్ష్మి తెలిపారు. బుధవారం పట్టణంలోని 15వ వార్డు రాజంపేటలో మొక్కలు పంపిణీ చేశారు.

పరిశ్రమలో సౌకర్యాలు కల్పించాలి

కోహీర్, సెప్టెంబర్ 11 : పరిశ్రమలో స్థానికులకు ఉపాధితో పాటు అన్ని సౌకర్యాలను కల్పించాలని సీఐటీయూ క్లస్టర్ కన్వీనర్ మహిపాల్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని కవేలి సెయింట్ గోబెన్ పరిశ్రమలో పర్మనెంట్, కాంట్రాక్టు కార్మికుల వివరాలను తెలుసుకునేందుకు ఆయన సర్వే నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిశ్రమలో వెంటనే స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. నాయకులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో తాగునీటికి గోస

డ్రమ్ములో తాగునీటిని పట్టుకుంటున్న డబుల్ బెడ్‌రూమ్ కాలనీ వాసులు

- పది రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా బంద్
- ట్యాంకర్ల ద్వారా అరకొర సరఫరా
- మరమ్మతుల పేరున చేతులెత్తేస్తున్న అధికారులు
- ఇక్కట్లు పడుతున్న ప్రజలు

సదాశివపేట, సెప్టెంబర్ 11 : పట్టణంలోని సిద్దాపూర్ సమీపంలో గల డబుల్ బెడ్‌రూమ్ కాలనీ వాసులు తాగునీరు రాక పరేషాన్ అవుతున్నారు. పది రోజులుగా డబుల్ బెడ్‌రూమ్ కాలనీ ప్రజలకు మిషన్ భగీరథ నీరు రావడం లేదు. దీంతో కాలనీ ప్రజలు తాగు నీటి కోసం గోస పడుతున్నారు. వానాకాలంలోనూ డబుల్ బెడ్‌రూమ్ వాసులకు నీటి తిప్పలు తప్పడం లేదు. డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో దాదాపు 450 కుటుంబాలు ఉంటున్నాయి. మున్సిపల్ అధికారులు ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేస్తున్నారు. ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసే నీరు తాగడానికే సరిపోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. ఇతర అవసరాల కోసం ఇబ్బందులు పడుతున్నారు. ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసే నీటిని డ్రమ్ములో నింపుకొని వాడుకుంటున్నారు. ట్యాంకర్ల ద్వారా కూడా సరిపోను నీటిని సరఫరా చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీరు సరఫరా చేయాలని అధికారులను విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. భారీ వర్షాల వల్ల నల్లాల వాల్స్ జామ్ అయ్యాయని, మరమ్మతులు చేయడానికి సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారని వాపోతున్నారు. మరమ్మతుల పేరుతో మిషన్ భగీరథ అధికారులు చేతులెత్తేస్తున్నారని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డబుల్ బెడ్ రూమ్ కాలనీకి మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

ఉద్యోగభద్రత కల్పించేవరకు పోరాటం

బోర్ వట్ల శివారులోని ఎపిటోరియా పరిశ్రమ ఎదుట నిరసనలో స్థానికులు

హత్నూర, సెప్టెంబర్11 : స్థానికులపై పరిశ్రమ యాజమాన్యం ఎందుకింత వివక్ష చూపుతున్నదని హత్నూర మండలం బోర్వట్ల గ్రామ ప్రజలు, స్థానిక కార్మికులు ప్రశ్నించారు. హత్నూర మండలం బోర్వట్ల శివారులోని ఎపిటోరియా ఫార్మా యూనిట్-1 పరిశ్రమ ఎదుట స్థానికులు చేపట్టిన నిరసన కార్యక్రమం బుధవారం రెండో రోజుకు చేరుకున్నది. ఈ సందర్భంగా గ్రామస్తులు, స్థానిక కార్మికులు, యువకులు మాట్లాడుతూ పరిశ్రమలో ఏండ్ల తరబడి పనిచేస్తున్నా.. ఉద్యోగ భద్రత కల్పించడంలో పరిశ్రమ యాజమాన్యం వివక్ష చూపుతున్నదని ఆరోపించారు. పరిశ్రమ వల్ల విడుదల అవుతున్న కాలుష్యంతో నిత్యం ఇబ్బందులు పడుతున్న స్థానికులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడమేకాకుండా చిన్నచూపు చూస్తుందని అర్హతలేని స్థానికేతరులకు ఉద్యోగ భద్రత కల్పిస్తుందన్నారు. ఇప్పటికైనా పరిశ్రమ యాజమాన్యం స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతోపాటు ఉద్యోగులుగా గుర్తించాలని లేనిపక్షంలో నిరసన విరమించబోమని హెచ్చరించారు. కార్మికులు, గ్రామస్తులు చేపట్టిన నిరసన కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్ మద్దతు తెలిపారు. నాయకులు నాగప్రభుగౌడ్, సతీశ్ యాదవ్ తోపాటు కమలాకర్, మల్లారెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేయాలి

రామచంద్రాపురం, సెప్టెంబర్ 11 : భెల్ ఎస్సీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను అభివృద్ధి చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు అమృతరావు సూచించారని భెల్ ఎస్సీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సురేందర్ తెలిపారు. ఇటీవల భెల్ లో జరిగిన ఎస్సీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికల్లో విజయం సాధించిన అధ్యక్షుడు సురేందర్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు అధ్యక్షుడు అమృతరావుని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రధానకార్యదర్శి దేవార్జున్, ఆర్గనైజింగ్ సెక్రటరి రవి కుమార్, ఉపాధ్యక్షుడు కొడాలి సురేశ్, కోశాధికారి నరసింహులు, జాయింట్ సెక్రటరీ స్వామిదాస్, మా జీ అధ్యక్షుడు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పును పున: పరిశీలించాలి

సంగారెడ్డి, సెప్టెంబర్ 11 : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ బద్ధంగా, న్యాయబద్ధంగా లేదని, చెన్నయ్య కేసులో సుప్రీంకోర్టు ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ఇచ్చిన తీర్పును పూర్తిగా పరిగణలోకి తీసుకోకుండా ఆరుగురు జడ్జిలు ఇచ్చిన తీర్పును పున:పరిశీలించాలని ఎస్సీ వర్గీకరన వ్యతిరేక పోరాట సమితి నాయకులు కోరారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ అతిథిగృహం నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టర్ క్రాంతికి వినతిపత్రం అందజేశారు.

పుట్‌పాత్‌పై విరిగిపడిన కొండచరియలు

విరిగిపడ్డ కొండ చరియలు, మట్టి పెళ్లలు

బొల్లారం, సెప్టెంబర్ 11 : ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని ఔటర్ సమీపంలోని సర్వీస్ రోడ్డు పక్కన కొండ చరియలు విరిగిపడిన సంఘటన రెండు రోజుల కింద చోటుచేసుకుంది. తడిసిన కొండచరియల మట్టి పెళ్లలు సర్వీస్ రోడ్డు పుట్‌పాత్‌పై పడ్డాయి. బాటసారులు, మార్నింగ్ వాకర్స్ రాత్రివేళల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి పుట్‌పాత్‌పై విరిగిపడిన కొండ చరియలు, మట్టిపెళ్లలు తొలిగించాలని స్థానికులు కోరుతున్నారు.

పోచమ్మ బస్తీ సమస్యలు పరిష్కరించాలి

పోచమ్మ బస్తీలో నెలకొన్న సమస్యలను చూపుతున్న స్థానికులు

బొల్లారం సెప్టెంబర్ 11 : బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని 19 వార్డు పోచమ్మ బస్తీలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బస్తీ వాసులు వాపోతున్నారు. ఎన్నో ఏండ్లుగా బస్తీలోని రోడ్లు గుంతలమయంగా మారాయని, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బురదతో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బస్తీలో తాగునీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా బస్తీ సమస్యలను పరిష్కరించి అభివృద్ధికి సహకరించాలన్నారు. యువజన నాయకుడు ఎండీ ఇమ్రాన్, స్థానికులు నవీన్ రెడ్డి పాల్గొన్నారు.

ఆటో బోల్తా పడి విద్యార్థులకు గాయాలు

ఝరాసంగం, సెప్టెంబర్ 11 : విద్యార్థులతో వెళ్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టి ఇద్దరు విద్యార్థులకు గాయాలైన ఘటన మండల పరిధిలోని కుప్పానగర్ గ్రామ శివారులో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మచునూర్ గ్రామానికి చెందిన సాత్విక్ రెడ్డి కుప్పానగర్ పాఠశాలలో 8వ తరగతి, జస్వంత్ ఝరాసంగం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నారు. రోజు మాదిరిగానే బుధవారం పాఠశాలకు వెళ్లే సమయంలో కుప్పానగర్ శివారులో ముందున్న ఆటో అకస్మాత్తుగా బ్రేకులు వేయడంతో వెనుకాల నుంచి వస్తున్న ఆటో ఢీకొని బోల్తా కొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న సాత్విక్‌కు తీవ్రగాయాలయ్యాయి. జస్వంత్‌కు స్వల్ప గాయాలు కావడంతో ప్రథమ చికిత్స అనంతరం ఇంటికి వెళ్లిపోయారు.

ఫర్టిలైజర్ యజమానులు నిబంధనలు పాటించాలి

దుకాణంలో తనిఖీ నిర్వహిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్

కోహీర్, సెప్టెంబర్ 11 : ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు ప్రభుత్వ నిబంధనలను పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి శివ ప్రసాద్ హెచ్చరించారు. బుధవారం కోహీర్ పట్టణంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో ఆయన తనిఖీలు నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి నవీన్ కుమార్, ఏఈవో శ్రీనివాస్‌ను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఏడీఏ భిక్షపతి, రైతులు ఉన్నారు.

గణనాథుడికి కార్పొరేటర్ పూజలు

భారతీనగర్‌లో వినాయకుడిని దర్శించుకున్న కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి దంపతులు

రామచంద్రాపురం,సెప్టెంబర్11 : భారతీనగర్ డివిజన్‌లోని ఓల్డ్ ఎంఐజీ, న్యూ ఎంఐజీ కాలనీల్లో వినాయక మండపాల్లో ప్రతిష్టించిన గణనాథులను కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయని, స్వామివారు ప్రజలందరినీ సుఖసంతోషాలతో చల్లగా చూడాలని ఆమె కోరుకున్నారు.

నకిలీ రిపోర్టర్‌లపై కఠిన చర్యలు తీసుకుంటాం

పటాన్‌చెరు, సెప్టెంబర్ 11 : నకిలీ రిపోర్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం పటాన్‌చెరు డీఎస్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నకిలీ రిపోర్టర్లు బిల్డర్ల వద్దకు, సాధారణ ఉద్యోగులు కడుతున్న ఇండ్ల నిర్మాణాల వద్దకు వెళ్లి రిపోర్టర్లమని బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. రిపోర్టర్‌మని, తమకు రెవెన్యూ, పంచాయతీరాజ్‌శాఖ, మున్సిపల్‌శాఖ అధికారులు బాగా తెలుసుని ఫిర్యాదు చేస్తే మీ నిర్మాణం కూలిపోతుందని కాబట్టి డబ్బులు ఇవ్వాలని బెదిరింపులకు దిగుతున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఇది చట్టవ్యతిరేక చర్యలని డీఎస్పీ పేర్కొన్నారు. ఈ మధ్య డబ్బుల కోసం బ్లాక్‌మెయిల్ చేసిన వ్యక్తిని అరెస్టు చేశామని, మరొకరినీ అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అదుపులోకి తీసుకున్నామన్నారు. కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ఉపాధ్యాయులను సన్మానించిన క్లాస్‌మేట్ క్లబ్ సభ్యులు

హత్నూర, సెప్టెంబర్ 11 : హత్నూర మండలం సిరిపుర ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తూ జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులను బుధవారం సన్మానించారు. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న నర్సింహులు, గీతా రాణి జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. పేద విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు కృషిచేస్తున్న ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విజయలక్ష్మి నరేందర్, గ్రామ కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో..

రామచంద్రాపురం, సెప్టెంబర్ 11 : ఉపాధ్యాయులను గౌరవించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని క్లాస్‌మేట్ క్లబ్ అధ్యక్షుడు జయప్రకాశ్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఆర్సీపురం, పటాన్‌చెరు, అమీన్‌పూర్, జిన్నారం, గుమ్మడిదల మండలాలకు చెందిన 45 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. ఎంఈవోలు పీపీ రాథోడ్, జెమినికుమారి, రాంప్రసాద్, క్లాస్‌మేట్ క్లబ్ సభ్యులు బచ్చుకృష్ణ, శ్రీధర్, మణికంఠ, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అదనపు బస్సులను నడపాలి

ఝరాసంగం, సెప్టెంబర్ 11 : ఝరాసంగం మండల పరిధిలోని ఎల్గోయి గ్రామానికి ఉదయం 8:20 గంటలకు రావల్సిన బస్సు 9:20 వస్తుందని గ్రామ స్తులు వాపోయారు. గ్రామం నుంచి నిత్యం జహీరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు బస్సు ఆలస్యంగా రావడంతో ప్రతిరోజూ తరగతులకు ఆలస్యంగా వెళ్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వచ్చిన బస్సులో సీటింగ్ కెపాసిటీకి మించి రెండింతలు ఎక్కుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. అదనపు బస్సులతో పాటు కళాశాల సమయానికి అనుకూలంగా బస్సు నడిపించాలంటూ విద్యార్థుల తల్లిదండ్రు లు ఆర్టీసీ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

బొల్లారం సెప్టెంబర్ 11: బొల్లారం మున్సిపల్ సాధరణ క